కేటీఆర్ నుంచి నియామకపత్రాన్ని అందుకుంటున్న పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడిగా వెంకట్‌రెడ్డి

మొయినాబాద్, ఫిబ్రవరి 10 : బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి పట్లోళ్ల సబితారెడ్డి సమక్షంలో పార్టీ మండల అధ్యక్షుడిగా వెంకట్‌రెడ్డిని నియమించారు. కేటీఆర్ కోస్గికి వెళ్తున్న సందర్భంగా మొయినాబాద్‌లోని హిమాయత్‌నగర్ చౌరస్తాలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డికి నియామకపత్రం అందజేశారు. వెంకట్‌రెడ్డి పదేండ్లుగా బీఆర్ఎస్ పార్టీలో పని చేస్తున్నారు. సర్పంచ్‌గా, ఎంపీటీసీగా బాధ్యతలు నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో షాబాద్ మండల పరిధిలోని సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా పని చేశారు. పార్టీ బలోపేతం కోసం చేస్తున్న కృషిని గుర్తించి మండల అధ్యక్షుడిగా నియమించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి, పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు స్వప్న, సీనియర్ నాయకులు శ్రీహరియాదవ్, జయవంత్, జగన్‌మోహన్‌రెడ్డి, సుధాకర్‌యాదవ్, ఎంఏ రవూప్, ఎం.రవియాదవ్ పాల్గొన్నారు.

కేటీఆర్ సభకు తరలిన గులాబీ దళం

కేశంపేట : కోస్గికి బయలుదేరుతున్న బీఆర్ఎస్ నేతలు

కేశంపేట, ఫిబ్రవరి 10: కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి పట్టణంలో సోమవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిర్వహించ తలపెట్టిన రైతు ధర్నాకు కొండారెడ్డిపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. వెళ్లిన వారిలోమండల పరిధిలోని కొండారెడ్డిపల్లికి చెందిన యువ నాయకుడు ప్రేమ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో కేశంపేట మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్, నాయకులు మురళీకృష్ణయాదవ్, రాంరెడ్డి, దశరథ, శ్రీశైలంయాదవ్, ఆసీఫ్, చింతకుంటపల్లి రమేశ్ తదితరులు ఉన్నారు.

విద్యా వలంటీర్‌కు గౌరవ వేతనం అందజేత

కొందుర్గు, ఫిబ్రవరి 10 : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యా వలంటీర్‌గా పని చేస్తున్న జ్యోతికి మాజీ వైస్ ఎంపీపీ రాజేశ్‌పటేల్ గౌరవ వేతనాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 8 ఏండ్ల నుంచి మండల కేంద్రంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో అవసరం ఉన్నటోట పని చేస్తున్న విద్యా వలంటీర్లకు వేతనాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రత్నయ్య, ప్రభాకర్, వాసురి, ఎలీషా, సచిన్, ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, ఉపాధ్యాయులు ఆంజనేయులు, మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు బీఆర్ఎస్ అండ

- మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి
- మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న దశరథ్‌నాయక్, ఆనంద్, లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్, ఫిబ్రవరి 10 : మండల పరిధిలో ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. మండల కేంద్రానికి చెందిన మూడ నర్సమ్మ అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు నర్సమ్మ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి.. దశరథ్‌నాయక్, ఆనంద్, లక్ష్మీనర్సింహారెడ్డి ఐదు వేల చొప్పున రూ.15 వేలు అందజేశారు. కష్టాల్లో ఉన్న ప్రతి ఒక్కరినీ బీఆర్ఎస్ పార్టీ అన్ని విధాల ఆదుకుంటుందని నాయకులు తెలిపారు.

చెక్కు అందజేత

మండల కేంద్రానికి చెందిన చుక్కాని నరేశ్ అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందాడు. వైద్య ఖర్చుల కోసం సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా మాజీ మంత్రి సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో రూ.60 వేల చెక్కు మంజూరైంది. సోమవారం బాధితుడికి బీఆర్ఎస్ నాయకులు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు నర్సింహ, రామచంద్రయ్య, బాలయ్య, బుచ్చయ్య, పాపయ్య, కృష్ణయ్య, అశోక్, రవి, వెంకటేశ్, గణేశ్, గిరి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణం కోసం స్థల సర్వే చేయాలి

తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నక్కలపల్లి గ్రామస్తులు

మొయినాబాద్, ఫిబ్రవరి 10 : ఈసీ వాగుపై రెండు మండలాల మధ్య రాకపోకలు సాగించడానికి నిర్మించ తలపెట్టిన వంతెన నిర్మాణం కోసం స్థల సర్వే చేయాలని సోమవారం నక్కలపల్లి గ్రామస్తులు తహసీల్దార్ గౌతంకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. మండల పరిధిలోని నక్కలపల్లి, షాబాద్ మండల పరిధిలోని సందనవెల్లి, సోలిపేట గ్రామాల రెవెన్యూలో మధ్య ఉన్న ఈసీ వాగుపై వంతెన నిర్మాణం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరయ్యాయి. కొన్ని కారణాలతో అప్పట్లో పనులు ఆగిపోయాయి. సోమవారం పనులను ప్రారంభిస్తుండగా నక్కలపల్లి గ్రామస్తుడు మంగళారం శ్రీకాంత్ ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. పనులు చేస్తుంటే జేసీబీ డ్రైవర్‌పై దాడి చేయడానికి ప్రయత్నించారని తెలిపారు. ఈ విషయమై గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. తన పేరు చెప్పుకుని శ్రీకాంత్ వంతెన నిర్మాణ పనులు ఆపి వేయిస్తున్నారని చెప్పడంతో ఎమ్మెల్యే తహసీల్దార్‌ను పిలిపించి వెంటనే వంతెన నిర్మాణం కోసం స్థలం సర్వే చేసి పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. మంగళవారం వంతెన స్థలం సర్వే చేస్తామని తహసీల్దార్ ఎమ్మెల్యేకు చెప్పారు.

బాధితురాలి కుటుంబానికి ఆర్థికసాయం

కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న చేవెళ్ల మాజీ సర్పంచ్ ఆగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి

చేవెళ్లటౌన్, ఫిబ్రవరి 10 : మండల పరిధిలోని కుమ్మెర గ్రామానికి చెందిన మంగలి హరిశంకర్ భార్య శోభ లివర్ సమస్యతో దవాఖానలో చికిత్స పొందుతున్నది. వైద్య ఖర్చుల నిమిత్తం సోమవారం చేవెళ్ల మాజీ సర్పంచ్ బండారి ఆగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి రూ.20వేలు అందజేశారు. కార్యక్రమంలో చేవెళ్ల మాజీ సర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్‌యాదవ్, నాయకులు మద్దెల శ్రీనివాస్, పడాల రాములు, సత్యం, రాజు తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడిన వాహనాలకు వేలం

ఆమనగల్లు, ఫిబ్రవరి 10 : ఆమనగల్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల్లో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు మంగళవారం ఉదయం 10.30 గంటలకు వేలం పాట నిర్వహిస్తున్నామని ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆమనగల్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ ప్రాంగణంలో నిర్వహించే వేలం పాటలో పాల్గొనే వారు ధరావత్తు చెల్లించాలన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మంచాల : ఆరుట్ల సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మంచాల, ఫిబ్రవరి 10 : మంచాల మండల పరిధిలోని ఆరుట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-05 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 20 ఏండ్ల తర్వాత కలుసుకోవడంతో పూర్వ విద్యార్థులు గత అనుభవాలు, చిన్నప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యా బుద్ధులు నేర్పించిన గురువులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మేడిపల్లిలో..

యాచారం : మండల పరిధిలోని మేడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1915-16లో విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మల్కీజ్‌గూడలో ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పుడు పాఠ్యాంశాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

యాచారం : ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

ప్రమాద బీమా.. కుటుంబానికి ధీమా

ప్రమాద బీమా పాలసీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు, నేతలు

కేశంపేట, ఫిబ్రవరి 10 : ప్రమాద బీమా పాలసీ ప్రతి కుటుంబానికి ధీమా అని కేశంపేట మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి అన్నారు. కేశంపేట తపాలా శాఖ కేశంపేట సీనియర్ మేనేజర్ రాజశేఖర్, మేనేజర్ మీర్జామోజమ్‌బేగ్ ఆధ్వర్యంలో ప్రమాద బీమాపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏడాదికి రూ.555తో ప్రమాద బీమా చేయించుకుంటే ఏదైనా ప్రమాదం జరిగి మరణిస్తే ఆ కుటుంబానికి రూ.10లక్షల ఆర్థిక భరోసా అందుతుందన్నారు. రూ.755 బీమా చేయించుకుంటే రూ.15లక్షల వరకు ప్రమాద బీమా వస్తుందన్నారు. 18 నుంచి 65 ఏండ్లలోపు వారు ఎవరైనా పాలసీ చేయించుకోవాలని, మరింత సమాచారం కోసం దగ్గరలోని పోస్టాఫీస్‌లో సంప్రదించాలని కోరారు. పాలసీ తీసుకున్న వారికి విద్యా ప్రయోజనం కోసం రూ.50వేలు, వైద్య ఖర్చులకు రూ.లక్ష, వివాహ ప్రయోజనాలకు రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు లబ్ధి చేకూరే అవకాశాలు ఉన్నాయన్నారు. అనంతరం పలువురు ప్రజల నుంచి దరఖాస్తులను తీసుకొని ప్రమాద బీమా చేసి పాలసీకి సంబంధించిన పత్రాలను అందజేశారు.

అదృశ్యమైన మహిళ హత్య

సత్యమ్మ(ఫైల్)

షాబాద్/షాద్‌నగర్‌రూరల్, ఫిబ్రవరి 10: అదృశ్యమైన ఓ మహిళ హత్యకు గురైంది. షాబాద్ సీఐ కాంతారెడ్డి తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని మన్‌మర్రి గ్రామానికి చెందిన జటని సత్యమ్మ (65) ఈ నెల 7న ఉదయం షాద్‌నగర్ దవాఖానకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పింది. సాయంత్రం వరకు ఆమె ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. 8న పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. సోమవారం ఉదయం షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రంగంపల్లి వద్ద గుర్తు తెలియని మహిళ మృతదేహం కనిపించడంతో కుటుంబసభ్యులకు సమాచారం అందించడంతో అక్కడికి వెళ్లి చూడగా సత్యమ్మగా గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆమె ఒంటిపై ఉన్న బంగారు నగలు తీసుకుని, హత్య చేసి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతురాలి భర్త అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

షాబాద్, ఫిబ్రవరి 10: చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. షాబాద్ సీఐ కాంతారెడ్డి తెలిపిన వివరాలు.. షాబాద్‌కు చెందిన గడ్డం చంద్రయ్య (48) ఈ నెల 8న మధ్యాహ్నం సమయంలో ఇంట్లో నుంచి బయటకి వెళ్లాడు. అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసు నమోదు చేశారు. సోమవారం ఉదయం షాబాద్ పహిల్వాన్ చెరువులో ఒక వ్యక్తి మృతదేహం తేలుతూ కనిపిస్తున్నట్లు సమాచారం రావడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించి చూడగా చంద్రయ్యగా గుర్తించారు. ఈ మేరకు మృతుడి భార్య యాదమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సంకెపల్లిగూడలో ఓ ఇంట్లో చోరీ

షాబాద్, ఫిబ్రవరి 10: గుర్తు తెలియని వ్యక్తులు ఓ ఇంట్లో చొరబడి బంగారు నగలతో పాటు, నగదు ఎత్తుకెళ్లిన ఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. షాబాద్ సీఐ కాంతారెడ్డి తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని సంకెపల్లిగూడకు చెందిన కుమ్మరి చంద్రకళ ఇల్లు గ్రామ సమీపంలోని మసీదు వద్ద ఉంటుంది. ఈ నెల 9న ఉదయం తన కోడలు, పిల్లలు ఆరోగ్యం బాగా లేక పోవడంతో షాద్‌నగర్ దవాఖానకు వెళ్లారు. సాయంత్రం 4గంటలకు ఇంటికి వచ్చి ఇంటి తాళం తీసి చూడగా, గుర్తు తెలియని వ్యక్తులు బెడ్ రూమ్‌లో ఉన్న బీరువాలో పెట్టిన పుస్తెలతాడు, నానుతైన్, కమ్మలు, పట్టగొలుసులు, టీవీ, కొంత నగదును ఎత్తుకెళ్లారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బదిలీపై వెళ్తున్న ఎస్సైకి సన్మానం

ఆమనగల్లు, ఫిబ్రవరి 10 : బదిలీపై వెళ్తున్న ఎస్సై యాదయ్యను సోమవారం సన్మానించారు. ఆమనగల్లు పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైగా యాదయ్య విధులు నిర్వహించారు. ఇటీవలే ఎస్సైగా పదోన్నతి పొందడంతో పాటు ఆర్‌జీఐ ఔట్ పోస్టుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకటేశ్ ఆధ్వర్యంలో యాదయ్యను సన్మానించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ టోర్నమెంట్

విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న వగ్గు మహేశ్, పాపిశెట్టి రాము, మనోహర్‌రెడ్డి

ఆమనగల్లు, ఫిబ్రవరి 10 : పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా ఆమనగల్లు వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. ఈ టోర్నీలో విన్నర్‌గా స్ట్రైకర్ జట్టు, రన్నర్‌గా లోకల్ స్టార్స్ జట్టు నిలిచాయి. ఈ జట్లకు అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు వగ్గు మహేశ్, మెడికల్ అసోసియేషన్ నాయకులు పాపిశెట్టి రాము, సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు మనోహర్‌రెడ్డి విజేత జట్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు జగన్, పవన్‌కల్యాణ్, రమేశ్, మహేందర్, ఆర్గనైజర్లు దేవేందర్, రవి, సురేశ్, చాంద్‌పాషా, గౌస్, భరత్, మల్లేశ్, వెంకట్, క్రీడాకారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి తీవ్రగాయాలు

యాచారం, ఫిబ్రవరి 10 : కారు-క్రూయిజర్ ఢీకొన్న ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని గున్‌గల్ రిజర్వాయర్ సమీపంలో నాగార్జున సాగర్ హైదరాబాద్ ప్రధాన రహదారిపై సోమవారం సాయంత్రం జరిగింది. సీఐ నరసింహారావు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని మేడిపల్లికి చెందిన మాజీ సర్పంచ్ చిగురింత శ్రీనివాస్‌రెడ్డి కుమారుడు ఆదివారం రోడ్డు ప్రమాదంలో గాయపడి దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. శ్రీనివాస్ రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి దవాఖానలో చికిత్స పొందుతున్న కుమారుడిని పరామర్శించి తిరిగి హైదరాబాద్ నుంచి కారులో స్వగ్రామానికి వస్తున్నాడు. గున్‌గల్ రిజర్వాయర్ సమీపంలోకి రాగానే మాల్ నుంచి హైదరాబాద్ వైపు ఎదురుగా వస్తున్న క్రూయిజర్, కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో శ్రీనివాస్‌రెడ్డితో పాటు రాంచంద్రారెడ్డి, జయమ్మ, ఇందిరమ్మ, కవితకు తీవ్ర గాయాలయ్యాయి. క్రూయిజర్‌లో ఉన్న సుచరితకు గాయాలయ్యాయి, యాదయ్య, శ్రీనివాస్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని 108 అంబులెన్స్‌లో నగరంలోని ఓ ప్రైవేటు దవాఖానాకు తరలించారు. ప్రమాదంలో కారు, క్రూయిజర్ ముందు భాగం నుజ్జునుజ్జయ్యాయి. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం

ఆదిబట్ల, ఫిబ్రవరి 10 : స్కూల్ విద్యార్థులను తరలిస్తున్న ఓ స్కూల్ బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న డివైడర్‌ను ఢీకొట్టడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని నాగార్జున సాగర్ హైవే పై ఉన్న కళ్లెం జంగారెడ్డి గార్డెన్ ఎదుట సోమవారం ఉదయం జరిగింది. బొంగుళూరు సమీపంలోని నలంద పాఠశాలకు చెందిన స్కూలు బస్సు పది మంది విద్యార్థులను తీసుకుని ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని చింతపల్లి గూడ నుంచి బొంగుళూరు నలంద పాఠశాలకు వెళ్తుండగా బస్సు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. బస్సులో ప్రయాణిస్తున్న మూడో తరగతి విద్యార్థి సాత్విక్, పాఠశాలలో పనిచేస్తున్న అటెండర్ మంగమ్మ, బస్సు డ్రైవర్ కిషన్‌కు గాయాలు కావడంతో స్థానికులు వెంటనే వారిని దవాఖానకు తరలించారు. మరి కొంత మంది విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

ద్విచక్రవాహనదారులతో మాట్లాడుతున్న సీఐ కృష్ణంరాజు

యాచారం, ఫిబ్రవరి 10: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పీఎస్ సీఐ కృష్ణంరాజు సూచించారు. మండల పరిధిలోని మేడిపల్లిలో సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. హెల్మెట్ లేకుండా వెళ్తున్న వాహనదారులకు రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇకపై హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే చూస్తూ ఊరుకునేది లేదని, చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై తేజం రెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

రైతులకు స్ప్రింక్లర్లను అందజేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

రైతులకు స్ప్రింక్లర్ల అందజేత

కడ్తాల్, ఫిబ్రవరి 10 : మండల కేంద్రంలోని రైతు వేదికలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సోమవారం రైతులకు స్ప్రింక్లర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖ జిల్లా అధికారి సురేశ్ మాట్లాడుతూ.. రైతులు స్ప్రింక్లర్ల కోసం మీ-సేవలో దరఖాస్తు చేసుకోవాలని, రూ.7,500 డీడీ చెల్లిస్తే సబ్సిడీపై స్ప్రింక్లర్లను అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గీతాముదిరాజ్, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పీఏసీఎస్, ఏఎంసీ డైరెక్టర్లు వెంకటేశ్, నరేశ్‌నాయక్, వ్యవసాయ శాఖ ఏడీఏ ఆదిలక్ష్మి, ఏవో శ్రీలత, హెచ్‌వో సౌమ్య, మాజీ ఎంపీటీసీలు శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు నర్సింహ, బీచ్యా నాయక్, భీక్యానాయక్, నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఓటరు జాబితా

మండల పరిషత్ కార్యాలయంలో ఓటరు జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపీడీవో నరేందర్‌రెడ్డి తదితరులు

యాచారం, ఫిబ్రవరి 10 : ఎంపీటీసీ, జడ్పీటీసీ-2025 ఎన్నికలకు సంబంధించిన ఓటరు జాబితాను అధికారులు సోమవారం ప్రదర్శించారు. మండల పరిషత్ కార్యాయంలో ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీలత, సూపరింటెండెంట్ శైలజ ఓటరు జాబితాను విడుదల చేసి నోటీసు బోర్డులో ఉంచారు. మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు ఓటరు జాబితాను ప్రదర్శించి ప్రజలకు అందుబాటులో నోటీసు బోర్డులో ఉంచారు. ప్రజలు తమ ఓటు ఉందో లేదో చూసుకోవాలని అధికారులు సూచించారు. తప్పు ఒప్పులను సరి చూసుకోవాలన్నారు. అవకాశాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి కోరారు.

పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల చేయూత

యాచారం, ఫిబ్రవరి 10 : మండల పరిధిలోని మేడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభివృద్ధి కోసం పూర్వ విద్యార్థులు చేయూత నిచ్చారు. పాఠశాలలో 1992-93 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి రూ.లక్ష విరాళాన్ని హెచ్ఎం ఉదయశ్రీకి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం విద్యార్థులకు అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మంజుల, జ్యోతి, జంగయ్య, జైపాల్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్, భూపాల్‌రెడ్డి, జంగారెడ్డి, జంగయ్య, బాలయ్య, శేఖర్‌రెడ్డి, జగన్‌నాయక్, చంద్రశేఖర్‌రెడ్డి, బాలమణి, పాపిరెడ్డి, బన్నె శ్రీశైలం, పొద్దుటూరి రవీందర్‌గుప్త తదితరులు పాల్గొన్నారు.

మండలంగా ప్రకటించని పక్షంలో పోరాటం ఉధృతం

కడ్తాల్, ఫిబ్రవరి 10 : కాంగ్రెస్ ప్రభుత్వం గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని మండల సాధన సమితి నాయకులు హెచ్చరించారు. తలకొండపల్లి మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. గట్టుఇప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ ఇప్పటి వరకు విడుతల వారీగా 241 రోజులుగా నిరాహార దీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సొంత మండలంలో ప్రజలు దీక్షలు చేపడితే కనీసం స్పందించకపోవడమేమిటని వారు ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన మండలాలను ఏర్పాటు చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో, గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమస్యను ఎమ్మెల్యే వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ కరాటే పోటీలో విద్యార్థుల ప్రతిభ

ఓపెన్ కరాటే పోటీలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

షాద్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 10 : హైదరాబాద్ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో న్యూడ్రాగన్ ఫైటర్స్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 4వ అంతర్జాతీయ ఓపెన్ కరాటే, కుంగ్‌ఫూ ఛాంపియన్‌షిప్ పోటీలో షాద్‌నగర్ న్యూ పవర్ కుంగ్‌ఫూ అకాడమీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు మాస్టర్లు బాల్‌రాజు, అహ్మద్‌ఖాన్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన సినీ నటుడు భానుచందర్ కరాటేలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో పాటు మాస్టర్లను అభినందించారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

పరీక్షా ప్యాడ్‌లు అందజేస్తున్న మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి

షాబాద్, ఫిబ్రవరి 10: విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని శంకర్‌పల్లి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి అన్నారు. సోమవారం శంకర్‌పల్లి మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదువుకుని మం